నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్, గురువారం 6 మార్చి 2025 | ADILABAD NIRMAL

అందని భగీరథ నీరు.. బావి నీరే దిక్కు..

బజార్‌హత్నూర్ మండలంలోని చింతకర్రలో గల వ్యవసాయ బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

నీటి కోసం తిప్పలు పడుతున్న గిరిజన బిడ్డలు

బజార్‌హత్నూర్ మండలంలోని చింతకర్ర గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గిరిజన బిడ్డలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులకోసారి మూడు, నాలుగు బిందెలే రావడంతో 40 కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. దీంతో పాటు జాతర్ల, అందుగూడ, కొత్తగూడ గ్రామల్లోని ట్యాంకులు నిండిన తరువాత చింతకర్ర గ్రామానికి చేరుకుంటాయి. దీనికి చింతకర్ర ఎత్తు ప్రదేశంలో ఉండడంతో ట్యాంకు సరిగా నిండకపోవడంతో నీటి ఇబ్బంది ఏర్పడుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో గ్రామానికి దగ్గరలో ఉన్న వ్యవసాయ బావి నుంచి నిత్యావసరాల కోసం నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని సక్రమంగా అందించే విధంగా చూడాలని అడవిబిడ్డలు కోరుతున్నారు.

- బజార్‌హత్నూర్, మార్చి 5

కాంగ్రెస్ తెచ్చిన కరువు

అన్నదాత అరిగోస

అందని గూడెం లిప్ట్, కడెం కాలువల నీళ్లు

- అడుగంటిన భూగర్భ జలాలు
- పాట్టకొస్తున్న దశలో ఎండుతున్న పంటలు
- బోరేస్తే పడలేదని.. బావి తవ్విస్తున్న యువరైతు చందు
- ఎకరంన్నరను కాపాడుకునేందుకు రూ. 4 లక్షల దాకా ఖర్చు
- ముక్కాసిగూడలో అగమ్యగోచరంగా అన్నదాతల పరిస్థితి
- మరో వారం పది రోజుల్లో ఎడారిగా మారనున్న పొలాలు

కోటి ఆశలతో వరి సాగు చేసిన ముక్కాసిగూడ రైతాంగానికి చివరకు నిరాశే మిగులుతున్నది. గూడెం లిప్ట్ పెద్ద కాలువ, కడెం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీరందక.. భూగర్భ జలాలు అడుగంటి పాట్ట దశకు వస్తున్న వరి కళ్ల ముందే ఎండిపోతుండగా, దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది.

- మంచిర్యాల, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ముక్కాసిగూడలో బావి తవ్విస్తున్న రైతు గంతుల చందు

ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న గంతుల చందు

ఈ చిత్రంలో ఎండిపోయిన పొలాన్ని చూపిస్తున్న యువరైతు పేరు గంతుల చందు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముక్కాసిగూడ గ్రామస్తుడు. మంచిర్యాల జిల్లాలోని గూడెం లిప్ట్ పెద్ద కాలువ, కడెం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా నీళ్లొస్తయని ఆశపడి ఎకరంన్నరలో వరిసాగు చేసిండు. ఈ కాలువల నీళ్లు చుట్టుపక్కనున్న ఊర్లలోకి వచ్చినా చాలు.. ఊట ఉంటదనుకున్నడు. ఒర్రెలో పొక్లెయిన్‌తో గుంత చేసి పొలం పారిస్తననుకున్నడు. కానీ, గత యాసంగి సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లోనూ అటు పెద్దకాలువ నీళ్లు, ఇటు కడెం నీళ్లు చుట్టుపక్కనున్న ఊళ్లలోకి రాలేదు. దీంతో పోయినేడు మాదిరిగానే ఈ ఏడాది కూడా కండ్ల ముందే పంట ఎండిపోతుంటే చూడలేక రూ.రెండు లక్షలు పెట్టి బావి తవ్విస్తున్నడు. గతేడాదే రూ.రెండు లక్షలు ఖర్చు చేసి బోర్ వేయిస్తే అది ఫెయిలైంది. సరిపడా నీళ్లు రాక పోయినేడు పంట చేతికిరాలేదు. అందుకే ఈసారి బావి తవ్విస్తున్నడు. అంటే రెండేళ్లలో ఎకన్నరం పొలం కోసం రూ.నాలుగు లక్షల దాకా ఖర్చు పెట్టిండు. పోనీ, ఈ ఏడాదైనా బావి తవ్వితే నీళ్లొస్తయనుకుంటే ఇప్పటికే పంటంతా వల్లిపోయింది. ఇప్పుడు నీరు పెట్టినా చేతికొస్తదన్న గ్యారంటీ లేదంటూ చందు నిట్టూర్చాడు. ఇలా ఈ ఒక్క రైతే కాదు.. ముక్కాసిగూడలో అనేక మంది తీవ్రంగా నష్టపోయే దుస్థితి దాపురించింది.

చెరువులు నింపకే ఎండుతున్న పంటలు..

దండేపల్లి మండలం ముక్కాసిగూడ రైతులకు యాసంగి సాగు నీళ్లు రావాలంటే వానకాలంలో కడెం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నుంచి వచ్చే నీటితో అల్లీపూర్ చెరువును నింపాలి. కానీ, ఈ ఏడాది వానకాలంలో చెరువును నింపలేదని రైతులు చెబుతున్నారు. అల్లీపూర్ చెరువు నిండితే వానకాలం సాగు చేసేటోళ్లం. ఎండాకాలం కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ నీళ్లు తాళ్లపేట, మాకులపేట వరకు వస్తే అల్లీపూర్ చెరువులో కొంత నీరు ఉండి మా ఒర్రెలో ఊట వస్తుండే. కానీ ఇప్పుడు జన్నారం మండలం తపాల్‌పూర్ వరకే కడెం నీళ్లు వస్తున్నయ్. అది కూడా 15 రోజులు ఇస్తున్నరు, 15 రోజులు బంద్ చేస్తున్నరు. మా ఊరు దాకా అవి చేరడం లేదు. పోనీ ఇటు పక్కనున్న గూడెం లిప్ట్ నీళ్లైనా వస్తాయనుకుంటే అవి మ్యాదర్‌పేట్, మామిడిపల్లి వరకే వస్తున్నయ్. అట్లా కాకుండా తాళ్లపేట దాకా ఆ నీరు వస్తే అట్లనన్న ఒర్రెలో ఊట వస్తుండే... దాన్నే తోడుకొని సాగు చేసేటోళ్లం. దాదాపు రెండు సీజన్‌లుగా ఆ పరిస్థితి లేదు. అందుకే మా పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వారం, పది రోజుల్లో పంటలు పూర్తిగా ఎండిపోతాయని వాపోతున్నారు. దాదాపు 50 ఎకరాలు నీరు లేక ఎండిపోయి ఎడారి అయిపోతాయంటున్నారు. ప్రస్తుతం అల్లీపూర్ చెరువులో కొంత నీరున్నా.. అవి తూము ఎత్తు కంటే దిగువకు ఉన్నాయని, తూములో నుంచి బయటికి వచ్చే నీళ్లు లేవని, చెరువులో పంప్ వేసి తీద్దామంటే చేపలు పెంచేటోళ్లు ఒప్పుకోవడం లేదంటున్నారు. కడెం నీళ్ల మా ఊరు దాకా వచ్చేలా చేయాలంటూ వేడుకుంటున్నారు. గతంలో మాదిరిగా వానకాలంలో చుట్టుపక్కనున్న చెరువులు నింపకపోవడం వల్లే పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు చెప్పుకొస్తున్నారు.

ఆపరేషన్లు చేయించుకున్న వారితో రిమ్స్ వైద్యుల బృందం

రిమ్స్‌లో క్యాన్సర్ ఆపరేషన్లు

- వైద్య సేవలను వినియోగించుకోవాలి..
- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్, మార్చి 5(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గల రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఖరీదైన క్యాన్సర్‌కు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిమ్స్‌లో ఆశన్న, నాందేవ్, పొచక్కలకు క్యాన్సర్ ఆపరేషన్‌లు నిర్వహించారు. పోచక్కకు వ్యాన్ డ్రాటిక్ క్యాన్సర్, మిగతా ఇద్దరికి కడుపు సంబంధింత క్యాన్సర్ ఆపరేషన్లు చేశారు. ఈ ఆపరేషన్లకు రూ.8 లక్షల వరకు ఖర్చు అయ్యేవి. ఇలాంటి ఖరీదైన ఆపరేషన్లను రిమ్స్‌లో ఉచితంగా చేస్తున్నట్లు, ప్రజలకు సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీలో ఏడాది కాలంలో 400 ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, వరదా వంటి ప్రాంతాలకు వెళ్లేవారని, ఇప్పుడు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అరుదైన ఆపరేషన్లను చేసిన వైద్యులను రోగుల బంధువులు సన్మానించారు. ఈ సమావేశంలో రిమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, అంకాలజీ సర్జన్ జక్కుల శ్రీకాంత్, న్యూరో సర్జన్ విజయమోహన్, యూరాలజిస్ట్ కార్తీక్, అనస్తీషియా వైద్యులు ఇమానీ, నరేందర్, పిడియాట్రిక్ సర్జన్ దేవిదాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- తొలిరోజు 434 మంది గైర్హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్‌లు
- నేడు ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

నిర్మల్ అర్బన్, మార్చి 5 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,323 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా..5,971మంది హాజరయ్యారు. 352 మంది గైర్హాజరయ్యారు. ఓకేషనల్‌లో 539 మందికి 82 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో పరశురాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఆదిలాబాద్‌లో 9,154 మంది హాజరు

ఎదులాపురం, మార్చి 5 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. నిమిషం నిబంధన సడలించి ఐదు నిమిషాలు చేయడంతో విద్యార్థులు సమయం కంటే గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. బుధవారం పరీక్షకు 9,814 మందికి 9,154 మంది హాజరు కాగా.. 660 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో జాదవ్ గణేశ్ తెలిపారు. పట్టణంలోని ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా సందర్శించి వసతులను పరిశీలించారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

మలేషియా అధికారులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్ నాయక్

స్వదేశానికి తీసుకొస్తా..

- మలేషియా జైలులో ఉన్న కార్మికులకు జాన్సన్ నాయక్ భరోసా
- మలేషియా వెళ్లి ఉన్నతాధికారులతో సంప్రదింపులు
- కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

ఖానాపూర్, మార్చి 5 : కడెం మండలంలోని లింగాపూర్‌కు చెందిన నరేశ్, భాస్కర్, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్.. దస్తురాబాద్ మండలంలోని మున్యాలకు చెందిన రవీందర్‌లు యేడాది క్రితం ఉపాధి కోసం మలేషియా వెళ్లారు. వీరు విజిటింగ్ వీసాతో వచ్చి పనిచేస్తూ పోలీసులకు చిక్కారు. వీరిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. ఈ విషయాన్ని వారం రోజుల క్రితం జైలు పాలైన వారి కుటుంబ సభ్యులు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌కు తెలిపారు. స్పందించిన జాన్సన్ నాయక్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో బాధితుల కోసం రెండు రోజుల క్రితం మలేషియా దేశానికి వెళ్లారు. అక్కడి అధికారులతో మాట్లాడి విడుదల చేయాడానికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని జాన్సన్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు జాన్సన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

విద్యార్థుల భద్రతే లక్ష్యం

నిర్మల్ అర్బన్, మార్చి 5 : విద్యార్థుల భద్రతే పోలీసుల లక్ష్యమని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'పోలీసు అక్క' పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రతి నెలలో ఒక రోజు మహిళా కానిస్టేబుల్‌తో ప్రభుత్వ బాలికల విద్యాసంస్థలను సందర్శించి హాస్టల్‌లో రాత్రి బస చేసి విద్యార్థుల స్థితిగతులు, సైబర్ క్రైమ్, గుడ్, బ్యాడ్ టచ్, భద్రత వంటి పలు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 18 కేజీబీవీలలో ఒక్కో కానిస్టేబుల్ ఒక్కో పాఠశాలను దత్తత తీసుకుని వారికి అవగాహన కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీలు అవినాశ్, రాజేశ్ మీనా పాల్గొన్నారు.

దాడులకు పాల్పడడం సరికాదు

ఎదులాపురం, మార్చి 5 : ఆదిలాబాద్ పట్టణ పరిశుభ్రతే ధ్యేయంగా పని చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై దాడులకు పాల్పడడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని దుర్గానగర్ లో మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు మురికి కాలువలను శుభ్రం చేస్తున్న జవాన్‌తోపాటు సిబ్బంది కాలనీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారని తెలిపారు. పోలీసులు వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చిరంజీవి కాంతరావు, మెరుగు చిరంజీవి, నారాయణరెడ్డి, సురేశ్, లక్ష్మీ, సంగీత, శాంతబాయి, అశోక్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

ఎదులాపురం, మార్చి 5 : రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణను అవలంభిస్తున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రదేశాలలో సూచి బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ లేజర్ గన్‌ను వినియోగిస్తూ వేగంగా నడుపుతున్న వాహనదారులపై చర్యలను తీసుకోవాలన్నారు. సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ పాండే రావు పాల్గొన్నారు.